క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల గ్రామ సమీపంలో గల మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం మంగళవారం నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మల్లికార్జున్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి ప్రవేశం కోసం 100 విద్యార్థులకు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పరీక్ష ఫీజు ఓసీ విద్యార్థులకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన గొల్ల చింతం బాలకిష్టమ్మకు మంజూరైన రూ.22 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయరాములుసాగర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

పాన్‌గల్: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుందని, ప్రజా పాలనలో వచ్చిన 13,540 దరఖాస్తుల ఆధారంగా సర్వే చేపడుతున్నామని ఎంపీడీఓ గోవింద్‌రావు సోమవారం పేర్కొన్నారు. ఇప్పటి వరకు మండలంలో 90 శాతం సర్వే పూర్తైనట్లు ఆయన తెలిపారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అర్హుల వివరాలను నమోదు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

లూయిస్ బ్రెయిలీకి నివాళి

వనపర్తి టౌన్: కంటి చూపు లేని వారు విద్య అభ్యసించడం కోసం బ్రెయిలీ లిపిని కనిపెట్టి అంధుల జీవితాల్లో వెలుగు నింపిన విద్యా ప్రదాత లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజారాంప్రకాష్, గిరిరాజాచారి, మండ్ల దేవన్ననాయుడు, బాలేమియ, కృష్ణయ్య, పరమేశ్వరచారి, సత్యంచారి, మాధవ చారి, నరసింహ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం



ఖిల్లాఘనపురం: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాసులు అన్నారు. ఎస్సీ ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తు ఈ నెల 19న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాకు సంబంధించిన మాదిగల మహాసభ కరపత్రాలను జిల్లా ప్రధాన కార్యదర్శులు యాదగిరి, సోళీపురం వెంకటయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల కృష్ణ, జిల్లా నాయకులు లక్ష్మయ్య, వెంకటయ్య, తిరుపతయ్య, బాలయ్య, గోవర్దన్, ఉత్తన్న, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీతో బంగారు భవిష్యత్



వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఐఐటీపై ఐఐటీ విద్యార్థి చరణ్‌తేజ్ అవగాహన కల్పించారు. విద్యార్థులు ఐఐటీలో సీటు సాధించేందుకు అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించచ్చని సూచించారు. అనంతరం ఐఐటీ విద్యార్థి చరణ్‌తేజ్‌ను చెలిమి సంస్థ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణేష్‌కుమార్, ఉపాధ్యాయ బృందం రవి, గిరిరాజాచారి, రుద్రమదేవి, వరదాచారి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎస్సీ హస్టల్ విద్యార్థులకు సోమవారం స్వెటర్లు, దుప్పట్లు, మంకీ క్యాప్, ఆల్ ఇన్ వన్ బుక్స్ హస్టల్ వార్డెన్ ఆంజనేయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు స్వెటర్లు, ఉలెన్ దుప్పట్లు, మంకీ క్యాప్‌లను అందజేశామన్నారు. దీంతో పాటు విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్ అందజేశామని ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యానికి అనుగుణంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

విద్యార్థుల భవిష్యతే లక్ష్యంగా..



ఓట్లంపూడితండా బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట: విద్యార్థుల భవిష్యతే లక్ష్యంగా పెట్టుకొని ఉపాధ్యాయులందరూ పనిచేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూచించారు. పట్టణ కేంద్రంలోని స్థానిక బాలికల సాంఘీక గురుకుల సంక్షేమ పాఠశాలలో ఆర్వో వాటర్ ఫిల్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందిగా ఉన్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల సమస్యలను అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని 40 శాతం డైట్ చార్జీలను పెంచారని కొనియాడారు. బాలికల ప్రత్యేక అవసరాల దృష్ట్యా కాస్మోటిక్ చార్జీలు కూడా పెంచారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసిందని మండిపడ్డారు. కొత్తకోట మున్సిపల్ కేంద్రంలో ఉన్నటువంటి బాలికల ఉన్నత పాఠశాలకు తరగతి గదులు, మూత్రశాలలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. సంక్రాంతి తర్వాత బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలకు అమడబాకుల సమీపంలో నూతన భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, బీచుపల్లి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, డాక్టర్ పీ.జే.బాబు, నరేందర్‌రెడ్డి, బోయేజ్, మోహన్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కొత్తకోట రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాటవెళ్లి పెద్ద తండా నుంచి ఓట్లంపూడితండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి, నాటవెళ్లి ఎన్‌హెచ్44 నుంచి ఊరగట్టు తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు గ్రామాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, ఏనాడు తండాలను, గ్రామాలను తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్న సందర్భాలు లేవని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, పి.కృష్ణారెడ్డి, బోయేజ్, ఎన్‌ఆర్‌ఐ అమర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, మేస్త్రీ శ్రీనివాసులు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కోసం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, బీటీ రోడ్లు వేయించడంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు.

ఒత్తిడి లేని చదువుతోనే విజయం



ఆత్మకూర్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇస్తున్న నిర్వాహకులు

ఖిల్లాఘనపురం: విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదివినప్పుడే విజయం సాధిస్తారని సైకాలజిస్ట్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలలో మామిడిమాడ, అప్పారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్, స్పందన ఈదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల వ్యక్తిత్వ వికాస నిర్మాణంపై అవగాహన కల్పించారు. సమాజంలో విలువలు కలిగిన పౌరులుగా ఎదగడానికి, పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై పలు సూచనలు చేశారు. అనంతరం శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చెన్నప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

పాన్‌గల్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తూ.. వారిలో సామర్థ్యాలు పెంచాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలలో మాందాపూర్, కేతేపల్లి, పాన్‌గల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశానికి ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. తరగతి గదిలో టీచింగ్, లెర్నింగ్ అనే రెండు ప్రక్రియలు జరుగుతాయని.. టీచింగ్ లెర్నింగ్‌కు దారి తీయాలన్నారు. అభ్యాసన అవరోధాలను గుర్తించి బోధిస్తేనే విద్యార్థులకు పాఠాలు అర్థమవుతాయన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ఎంఈఓ బాలరాజు అన్నారు. సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ఇతర సామగ్రి ఉచితంగా అందజేసారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని సంస్థ అధ్యక్షుడు రత్నసింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కృష్ణ, సంతోష్‌కుమార్, నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘108’ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూర్: అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన 108 అంబులెన్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని 108 సర్వీసుల జిల్లా మేనేజర్ రత్నమయ్య అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని 108 అంబులెన్స్‌ను, అందులోని పరికరాలను ఆయన పరిశీలించారు. ఫోన్ ద్వారా సమాచారం వచ్చిన వెంటనే రోగులకు, ఆపదలో ఉన్నవారికి అందుబాటులో ఉండాలని సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ శ్రీనివాస్, పైలెట్ భాస్కర్ ఉన్నారు.

పాఠశాలలో వసతులు కల్పించాలి

ఆత్మకూర్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారని అధికారులు, పాలకులు పట్టించుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుతుబ్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు లేక మధ్యాహ్న భోజన సమయంలో ఇబ్బందులు పడుతున్నారని, చుట్టు పక్కల వారి ఇళ్ల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. పాఠశాల ఆవరణలో పందుల సంచారంలోనే భోజనం చేస్తున్నారని, పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా మారిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో యూనూస్, సమీర్, వసీం, పాష, రవి ఉన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

వనపర్తి రూరల్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, వివిధ కేటగిరీలో మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సోమవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధంతో సోమవారం కార్మికులు వనపర్తి జిల్లా కేంద్రంలోని మరికుంట నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు 17 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మండ్ల రాజు, పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొబ్బిలి నిక్సన్, రాములు, లాలు, గోపాల్, శాంతయ్య, నరేష్‌గౌడ్, గడ్డం కురుమయ్య, యాదగిరి, బాలు, విజయ్, వెంకటమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

‘దళితుల భూమిలో సబ్‌స్టేషన్ నిర్మించొద్దు’

గోపాల్‌పేట: దళితుల భూమిలో సబ్‌స్టేషన్ నిర్మించాలనుకోవడం సరికాదని ఎంఎస్‌పీ జిల్లా కోకన్వీనర్ దప్పుస్వామి మాదిగ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంఎస్‌పీ నాయకులతో కలిసి తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. మండలంలోని తాడిపర్తిలో దళితులకు చెందిన భూమిని లాక్కొని, సబ్‌స్టేషన్ నిర్మించాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, గ్రామ అధ్యక్షుడు రాజేందర్, గంగారాం, సుందరమ్మ, నారాయణమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ మంజూరు చేయండి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అమరచింత వాసులు

అమరచింత: అమరచింత మండలానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంజూరు చేయాలని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు స్థానిక నాయకులు వినతిపత్రం అందించారు. ఈమేరకు మాజీ ఎంపీటీసీ తిరుమలేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అమరచింతను మండల కేంద్రంగా ఏర్పాటు చేసిందని, కానీ సహకార సంఘం మంజూరు చేయకపోవడంతో మండల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. నేటికీ ఉమ్మడి మండలంలోని ఆత్మకూర్ వ్యవసాయ సహకార సంఘం ద్వారానే రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘం కోసం స్థలం కేటాయించారని, ప్రభుత్వ పరంగా కార్యాలయం మంజూరు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, హరీష్‌నాయక్, రాకేష్‌గౌడ్, బాలరాజ్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

వనపర్తి విద్యా విభాగం: జిల్లా కేంద్రంలోని వల్లభ్‌నగర్ కాలనీలో గల శ్రీనందవరం చౌడేశ్వరి మాత వృద్ధాశ్రమానికి దాడి చంద్రశేఖర్‌రెడ్డి, ఓమేష్‌రెడ్డి రూ.32వేల విరాళం నిర్వాహకులకు అందజేశారు. తమ స్నేహితుడు రాము కొంతకాలంగా వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నాడని, అతడికి అండగా ఉండేందుకు విరాళం ఇచ్చినట్లు దాతలు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఇప్పుడు కూడా విరాళం అందజేశామన్నారు. నిస్వార్థంగా అనాథ వృద్ధులను అక్కున చేర్చుకొని సేవలందిస్తున్న రామును, అతడి కుటుంబసభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

‘అన్నదాతల కడుపు కొట్టొద్దు’



పెబ్బేరులో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వ్యవసాయ, కౌలు రైతులకు రూ.15 వేలు, పొలం లేని నిరుపేదలకు రూ.12 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని చెప్పినా మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. రైతు భరోసాను ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల హామీలో చెప్పి ఇప్పుడు కేవలం రూ.12వేలు ఇస్తామని చెప్పడంతో సోమవారం జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, రమేష్‌గౌడ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వామన్‌గౌడ్, గుంత మౌనికమల్లేష్, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, రాళ్ల కృష్ణయ్య, సామ్యానాయక్, పులేందర్‌రెడ్డి, బాలాంజనేయులుగౌడు, సత్యనారాయణగౌడ్, వనం రాములు, దిలీప్‌కుమార్‌రెడ్డి, కరుణశ్రీ, కర్రెస్వామి, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురం బస్టాండు వద్ద..



గోపాల్‌పేటలో..

‘ఖేల్లా’ విద్యార్థుల ఎంపిక

ఖిల్లాఘనపురం: ఇండియన్ ఒలంపియాడ్ రాష్ట్ర స్థాయి గణిత పరీక్షకు మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రతి సంవత్సరం పీటీ ఉష నిర్వహించే గణిత ప్రతిభా పరీక్షలు మొదటి రౌండ్‌లో పాఠశాలలో 8 నుంచి 10వ తరగతికి చెందిన విద్యార్థులు బి.సింధు, నాగలక్ష్మి, అలేఖ్య, శృతి, సంధ్య ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మునావర్ సుల్తానా తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో పాటుగా అందుకు కృషి చేసిన గణిత ఉపాధ్యాయులు శోభారాణి, శారద ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అమరచింత: మాదాసి కురువ, మదారి కురువ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం మండల కేంద్రంలోని బీరప్ప ఆలయం వద్ద సంఘం నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో కురువ రఘు, పూజారి కురువ గోపి, వీరేష్, సాయిలు, పెద్ద ఎములన్న, కంకలి ఇంద్రమ్మ, వెంకటన్న, నందిమళ్ల ఆంజనేయులు, పామిరెడ్డిపల్లి వెంకటన్న, ధర్మపురం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి రజని

వీపనగండ్ల: రాజ్యాంగ ప్రకారం అమలవుతున్న చట్టాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉంటేనే ప్రయోజనాలను పొందే వీలవుతుందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి న్యాయమూర్తి వి.రజని అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘పేదరిక నిర్మూలన–హక్కుల పరిరక్షణకు అమలవుతున్న చట్టాలు’ అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమలులో ఉన్న పలు చట్టాలపై మహిళలు, యువతకు అవగాహన కల్పించారు. పేదల కోసం లోక్ అదాలత్ ద్వారా అవసరమైన న్యాయ సహాయాన్ని పొందవచ్చన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, బాల కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ లక్ష్మమ్మ, డీఆర్‌డీఓ ఏపీడీఓ బాషానాయక్, వైద్యాధికారి రాజశేఖర్, ఏపీఓ శేఖర్‌గౌడ్, ఎస్ఐ రాణి పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేదాక ఉద్యమిస్తాం

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేసే దాకా ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎండీ జబ్బార్ అన్నారు. మండలంలోని తెల్లరాళ్లపల్లిలో స్థానిక సమస్యల పరిష్కారానికై పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల ముగింపు సమావేశంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాకనే గ్రామాల్లో దీక్షలు చేపట్టాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా స్థానిక సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీలలో మిగిలిన వాటిని అమలు చేయాలని, రుణమాఫీలో ఇంకా చాలా మంది రైతులకు రుణాలు మాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు వంటివి చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయితీ కార్యదర్శి నీలమ్మకు అందజేశారు. కార్యక్రమంలోబాల్యానాయక్, జంబులయ్య ఉన్నారు.

ఉపాధ్యాయులకు సర్వీస్ బుక్స్ అందజేత



టీచర్లకు సర్వీస్ బుక్స్ అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు మిరాసిపల్లి పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ రాజశేఖర్ తండ్రి కీ.శే. రామ్మూర్తి జ్ఞాపకార్థం సర్వీ స్ బుక్స్‌ను కొత్తకోట మండలంలోని మిరాసిపల్లి జెడ్పీహెచ్‌లో, ఆత్మకూర్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద, పెబ్బేరు మండలంలోని ఉపాధ్యాయులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర చంద్రశేఖర్ ఏఎంఓ మహానంది, జిల్లా డీసీఈబీ సెక్రెటరీ ఎస్.చంద్రశేఖర్, కొత్తకోట ఎంఈఓలు కృష్ణయ్య, కొండాపురం బాలరాజు, భాస్కర్‌సింగ్, ఎస్.జయరాములు, గెజిటెడ్ హెడ్మాస్టర్ వివేకానంద, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: సివిల్ సప్లయ్ హమాలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సివిల్ సప్లయ్ గోదాంల్లో 40ఏళ్లుగా హమాలీలు పనిచేస్తున్నా.. వారికి కూలి రేట్లు పెంచుతామని గతంలో జీఓను విడుదల చేసినా ఆ దిశగా చొరువ చూపలేదని దుయ్యబట్టారు. హమాలీల కూలి రేట్లు పెంచడంతో పాటు రెండు జతల బట్టలు ఇవ్వాలని, సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ చాంద్‌పాషకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోష, అంజనేయులు, శ్రీను, శివ, హమాలీలు ఉన్నారు.

వనపర్తి రూరల్: తెలంగాణ పౌర సరఫరాల సంస్థ, జీసీసీ హమాలీల 2024–25 ఎగుమతి, దిగుమతి రేట్లు పెంచాలని తెలంగాణ హమాలీ ఫెడరేషన్ (సీఐటీయూ) అనుబంధంతో రాష్ట్ర కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, టీయూసీఐ జిల్లా నాయకులు గణేష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పౌర సరఫరాల డీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు బలరాం, కురుమయ్య, రాజు, బొబ్బిలి నిక్సన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతుల జీవితాల్లో వెలుగులు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వేముల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: రైతుల జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగులు తీసుకొచ్చిందని, ఏడాదిలోనే రూ.వేల కోట్లు రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసిందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎకరాకు రూ.12వేలు రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా కార్యక్రమాల అమలు ప్రకటనపై సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, గంగాధర్‌గౌడ్, వినయ్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మెకానిక్ షబ్బీర్, కలీం, వంశీ, మణివర్ధన్‌రెడ్డి, గడ్డం శ్రీను తదితరులు ఉన్నారు.

9న కలెక్టరేట్ వద్ద రైతు ధర్నా

అమరచింత: ఈ నెల 9న నిర్వహించే ఆల్ ఇండియా రైతు డిమాండ్స్ డే విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న పిలుపునిచ్చారు. ఈమేరకు మండలంలోని కిష్టంపల్లి, మస్తీపురం, ఆర్‌ఆర్ సెంటర్‌లో వాల్‌పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9న రైతు జాతీయ డిమాండ్ డే గా గుర్తించాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అంక్షలు లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీని చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ఎకరానికి రూ.7,500 ప్రకారం రెండు పంటలకు కలిపి రూ.15 వేలు చెల్లించాలన్నారు. అన్ని పంటలకు బోనస్‌గా రూ.500 ఇస్తూ.. చెరుకుకు టన్నుకు రూ.వెయ్యి బోనస్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్ బియ్యం నిల్వ చేసిన మహిళపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: రేషన్ బియ్యం సేకరించి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం మండలంలోని మల్కిమియాన్‌పల్లి గ్రామానికి చెందిన చిలుమర్తి మణెమ్మ రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారన్న సమాచారంతో సివిల్ సప్లయి ఉప తహసీల్దార్ దుబ్బాక పరమేష్ ఆదివారం గ్రామానికి వచ్చి పరిశీలించారు. మణెమ్మ రేషన్ బియ్యాన్ని కిలో రూ.10కి కొనుగోలు చేసి 3 క్వింటాళ్ల బియ్యాన్ని ఇంట్లో ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేసుకోవడంతో పంచనామా నిర్వహించి బియ్యాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని ఖిల్లాఘనపురం రేషన్ డీలర్ వద్ద భద్రపర్చినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడం, అమ్మడం చట్టవిరుద్ధమని చిలుమర్తి మణెమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దుబ్బాక పరమేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి అమెజాన్ కంపెనీలో సంవత్సరానికి రూ.45 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం పొందిన పూర్వ విద్యార్థి యాదగిరి ని సోమవారం ఎంఈఓ జయశంకర్‌తో పాటుగా ఉపాధ్యాయులు శాలువాతో సన్మానిచారు. ఇంటర్ అనంతరం జంషెడ్‌పూర్‌లో ఎన్‌ఐటీ చదువుతున్న విద్యార్థి క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగం పొందినట్లు తెలిపారు.

క్రీడాకారుడి మృతిపై సంతాపం

ఆత్మకూర్: కబడ్డీ రాష్ట్రస్థాయి క్రీడాకారుడు మూలమల్ల విజయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై పలువురు సంతాపం తెలిపారు. సోమవారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న విజయ్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు విజయ్‌కి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు, కబడ్డీ క్రీడాకారులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.